# జిజ్ఞాస

**ప్రశ్న : "కొందరు గురువుల రూపమున నుండి అమాయకులను మోసగించుచున్నారు. అమాయకుల ధనమును, ఇంటిలోని వస్తువులను, వ్యక్తులను గూడ అవినీతికరముగ వినియోగించుకొని చెడగొట్టుచున్నారు. వారి చేతులలో చాలామంది అమాయకులు నష్టపోవుచున్నారు. ఇట్టి సందర్భములలో దేవుడుండి ఏమి చేయుచున్నట్లు? అమాయకులను రక్షించు భారము దేవునకు లేదా?**



**జవాబు :** ప్రశ్న చాల మంచిది. దీనికి సరియైన సమాధానము చాలా అవశ్యకము. మొదట అమాయకుడను మాట కర్థమేమౌ తెలుసుకొందాము. అమాయకుడనగా మాయ లేనివాడు. తన పని తాను చేసికొనుచు తనపై ఆధారపడిన వారిని పోషించుటకై ఆర్జన చేసి, తను అన్నవస్త్రములతో తృప్తి చెంది, ఇతరములైన ఆశలు, వ్యామోహములు, కక్కుర్తులు లేనివాడు. అట్టి వానిని ఎవడును మోసగించుట కవకాశము లేదు. మహిమ లున్నట్లు నటించి ప్రదర్శించు వారి వెంట కొందరు పడుచున్నారు. కొందరు పడుటలేదు. వెంటబడువారు అమాయకులు కాదు. తన మనస్సులో ఏవో వ్యామోహములు, కక్కుర్తులు లేనిచో మహిమలున్న వానితో తనకేమి పని? మహిమలున్న చోట వినోదము చూడవచ్చును. చూచినందులకు కొంత సొమ్ము చెల్లించవచ్చును. వారి వెంటపడుట అనగా కొంత స్వార్థముతో కూడిన పని. తమకు కార్యములలో జయమో, సులభముగ డబ్బును, పదవులను, సుఖమును సంపాదించుటయో వారి ఉద్దేశ్యము. చేసిన పని మంచిదై పదిమందికి పనికివచ్చునదైనప్పుడు కార్య జయమునకై మోసగాంద్ర వెంట పరుగెత్తుట ఎందులకు? పూర్వమొక పట్టణమున నా చిన్నతనమున ఒకరు సన్యాసి వేషముతో వచ్చిరి. ఒకరి ఇంట దిగి చిన్నమెత్తు బంగారము తీసికొని కుండలో పెట్టి, పూజ చేసి రెండు చిన్నముల బంగారమును తిరిగి యిచ్చిరి. దానితో ఆ యజమానికి ఆశ పెరిగెను. తన ఇంటనున్న బంగార మంతయును తీసి యిచ్చెను. తన చుట్టాలకు గూడ తెలిపి వారి బంగారము గూడ ఇప్పించెను. ఆ మొత్తమును కుండలో పెట్టి పూజచేసి ఆ మోసగాడు ఏడుదినముల తరువాత కుండ పగులగొట్టినచో రెట్టింపు బంగార ముండునని చెప్పెను. మూడు రోజుల తరువాత అతడు మాయమయ్యెను. వారందరు ఏడురోజుల వరకు కుండ పగులగొట్టలేదు. అటుపైన పగులగొట్టి చూడగా అందులో మట్టి తప్ప మరేమియు లేదు. అతడు మోసగించెనని దుఃఖపడిరి. సన్యాసులనగా దొంగలని రోషముతో అరచి పత్రికలలో ప్రకటించిరి. దానితో తమ కక్కుర్తి వ్యాప్తమగును గాని సన్యాసులు చెడ్డవారని ఋజువు కాదు గదా! వచ్చినవాడు మోసగాడే గాని సన్యాసి గాడు. వెంటబడినవారు తేలికగ రెట్టింపు బంగారము కాజేయవలెనను దుర్బుద్ధి కలవారే గాని అమాయకులు కారు. మోసపోయినపుడు మాత్రము అమాయకులమని కేకలు పెట్టుదురు. ఇట్టి సందర్భములలో భగవంతుడు కలుగజేసికొనునని భ్రమపడినచో అది నిజముగ భ్రమ మాత్రమే. దొంగసన్యాసులైనను ఆశ, కక్కుర్తి కలవారికి తగిన ఫల మనుభవింపజేసెదరే గాని, మిగిలిన అమాయకులను మోసగింపలేరు. తమకున్న బంగారము చాలునని తృప్తిపడిన వారిని మోసగింపలేరుగదా!

ఇండ్లలో చొరబడి ఎవరైన గురువుల రూపమున అవకాశము కలుగ జేసికొనుచున్నారన్నచో, చొరబడినవాని తప్పుకన్న చొరబడనిచ్చిన వారిలో కొన్ని రహస్య లోపములుండి తీరని హాని కలుగజేయును. ఇంటిలోని వారిలో దొంగతనమో మరి ఏదైన చెప్పగూడని రహస్య లోపమున్నచో మోసగాండ్రు గురువులవలె చేరి మొదట ఆ రహస్యమును పట్టుకొందురు. దానితో సంసారులు వారికి లొంగిపోవుదురు. తమ రహస్యములను యీ గురువులు బయట పెట్టుదురేమో యని భయపడి వారు చెప్పినట్లు చేయుదురు. దానితో ఆ కపట గురువులు ఆ గృహస్తుల ధనము, వస్తువులు, మర్యాద దోచుకొందురు.

సంసారులకు కష్టములు, ఆపదలు వచ్చుట వేరు. మోసపోవుట వేరు. కష్టములు, ఆపదలు అజ్ఞానము వలన కలుగుచున్నవి. ఆరోగ్య పద్ధతులు తెలియనివారికి జబ్బు లెక్కువగా చేయుచున్నవి. బిడ్డలను పెంచుట తెలియనివారికి బిడ్డలు చెడిపోవుట జరుగుచున్నది. ధనము వినియోగించుట తెలియని వారికి ఆర్థికపుచిక్కులు కలుగుచున్నవి. ఇది అజ్ఞాన మనబడును. ఇవి వేరు, మోసపోవుట వేరు. మోసపోవుట అజ్ఞానమువలన కాదు. దురాశ, వ్యామోహము తమలో రహస్యముగ విత్తనములై ఉండుట వలన మోసకాండ్ర చేతిలో మోసపోవుట జరుగును. కనుక దీనికి భగవంతుని నిందించి లాభములేదు. అతడు పలుకడు కదా!"

ఆగష్టు 11 తేదీ శ్రీమాన్ కులపతి ఎక్కిరాల కృష్ణమాచారిగారి జయంతి సందర్భముగా వారందించిన జ్ఞాన గుళికను మీకు అందిస్తున్నాము.

**- సంపాదకుడు**